ఆక్వా సాగుకు ప్రకృతి సెగ

- విపరీతమైన వాతావరణ మార్పులతో చెరువుల్లో ఆక్సిజన్ సమస్య
- అర్ధాంతరంగా చేపల పట్టుబడి చేస్తున్న రైతులు

గణపవరం: ఆక్వా సాగుకు ప్రకృతి సెగ తగులుతోంది. ఫలితంగా రైతులు చేపలను మధ్యలోనే అర్ధాంతరంగా పట్టివేసి అయినకాడికి అమ్ముకోవలసి వస్తోంది. గుడ్డిలో మెల్ల అన్నట్లుగా ప్రస్తుతం చేప ధర ఆశాజనకంగా ఉండటం కాస్త ఊరటనిస్తోంది. గత నెల రోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు ఆక్వా సాగుకు గండంగా మారాయి. ఆగస్టు నెలంతా ఎండల తీవ్రతే తగ్గలేదు. భారీ వర్షాలు, రోజుల తరబడి ముసురుతో కూడిన ఈ వాతావరణం ఆక్వా సాగుకు ముప్పుగా పరిణమించింది. ఏప్రిల్, మే నెలల్లో విపరీతమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రత కారణంగా చేపలు, రొయ్యలలో ఎదుగుదల పెద్దగా ఉండదు. జూలై నెల నుంచి వాతావరణం చల్లబడుతుంది. చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో చేపలు, రొయ్యలలో ఎదుగుదల బాగుండి, దిగుబడి పెరగాల్సిన ఈ సమయంలో విపరీతమైన ఎండల తీవ్రత, భరించ లేని ఉక్కబోతతో రొయ్యలు, చేపలలో ఎదుగుదల పూర్తిగా లోపించింది. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో


ఆక్వా చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

చెరువుల్లో ఆక్సిజన్ సమస్యలు తలెత్తడంతో చెరువుల్లోని చేపలు, రొయ్యలు మూతులు పైకెత్తి, నీటి ఉపరితలంపై నిస్సత్తువగా తిరుగుతున్నాయి. చేపలు, రొయ్యలు నీళ్లపైకి తేలిన సమయంలో విపరీతమైన ఎండ తీవ్రత కారణంగా రకరకాల వ్యాధులకు గురవుతున్నాయి. మరోవైపు ఆక్సిజన్ లేనికారణంగా చేపలు, రొయ్యలు నీరసించి, మేతలు కూడా సరిగా తినడంలేదు. ఈ సమస్యను అధిగమించడానికి చెరువుల్లో ఆక్సిజన్ శాతం పెంచడానికి ఆక్వా రైతులు రకరకాల రసాయనాలు చల్లుతున్నారు. నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లు వినియోగిస్తున్నారు. ఆయిల్ ఇంజన్లతో నీటిని చెరువులోనే రీసైక్లింగ్ చేస్తున్నారు. అనధికార విద్యుత్ కోతల కారణంగా ఆయిల్ ఇంజన్లు సిద్ధం చేసుకుని వినియోగిస్తున్నారు. ఇంతచేస్తున్నా చేపలు, రొయ్యలు చనిపోతుండటంతో రైతులు ఆఘమేఘాలపై పట్టుబడి చేస్తున్నారు. ప్రస్తుతం చేప, రొయ్య ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రస్తుతం కిలో చేప ధర రూ.120 వరకూ పలుకుతోంది. ఈ నెల రోజుల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా దాదాపు 20వేల ఎకరాల్లో చేపలను ఆక్సిజన్ సమస్య కారణంగా అర్ధాంతరంగా పట్టివేశారు. గణపవరం, నిడమర్రు మండలాల్లో పదివేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. అయితే వాతావరణ మార్పుల కారణంగా సాగు ముందుకు సాగక సుమారు ఆరువేల ఎకరాల్లో చెరువులు ఖాళీ అయ్యాయి.


చెరువులో నీటిని రీసైక్లింగ్ చేస్తున్న దృశ్యం


చేపలు పట్టుబడి చేస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: మధ్యాహ్న భోజనంలో నాణ్యత, శుభ్రత లోపిస్తే అందరూ బాధ్యత వహించాల్సి ఉంటుందని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఎండీఎం నిర్వాహకులను విడివిడిగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మధ్యాహ్నం భోజనంలో మెనూకు అనుగుణంగా నగదు చెల్లిస్తుందని ఎటువంటి తేడా రాకుండా మధ్యాహ్న భోజనం ప్రతిరోజూ బాధ్యతగా పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులతో అన్నారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వో రవికిషోర్ ఉన్నారు.

క్లుప్తంగా

రహస్య కెమెరాల ఘటనపై హోం మంత్రి స్పందించాలి


జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినుల బాత్‌రూమ్‌లో రహస్య కెమెరాలు ఏర్పాటు ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను దెందులూరు జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మహిళా నేత నిట్టా లీలానవకాంతం కోరారు. దాదాపు 300 మంది విద్యార్థినుల భవిష్యత్తు, భద్రతను అవహేళన చేస్తూ బాత్‌రూమ్‌ల్లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసిన ఘటనలో పాత్రధారులను, సూత్రధారులను అరెస్టు చేసి జిల్లా బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. హోం మంత్రి మహిళ అయి ఉండి ఈ ఘటనపై ఇప్పటి వరకు స్పందించకపోవడం, చర్యలకు ఉపక్రమించకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. కోల్‌కతా మహిళా వైద్యురాలి హత్యాచారంపై కోర్టు సుమోటోగా వ్యవహరించిన విధంగానే, కళాశాలల్లో రహస్య కెమెరాల ఉదంతంపై స్పందించి సుమోటోగా స్వీకరించి విచారణ చేయాలని జెడ్పీటీసీ లీలానవకాంతం కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం


ఉండ్రాజవరంలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ డైరెక్టర్ అవినాష్‌రాజు

దెందులూరు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, విద్యా, వైద్యం, సేవా రంగాల్లో ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ క్షేత్రస్థాయిలో సేవలందిస్తోందని ఉండ్రాజవరం గ్రామానికి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు ఆర్థిక సహాయంతో ఉండ్రాజవరంలో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను లయన్స్ క్లబ్ డైరెక్టర్ చుక్కా అవినాష్ రాజు ప్రారంభోత్సవం చేశారు. ఉండ్రాజవరంలో గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన తాగునీరు సరఫరాకు జరజాపు రంగారావు రూ. 2లక్షలతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించడం సంతోషంగా ఉందని లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు బీవీ రమణమూర్తి, రంగారావు, శరీష్, ఎంపీటీసీ సున్నా నరేష్ దాత రంగారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పరిశుభ్రతపై ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని, ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి వారంలో కనీసం ఒకరోజును పొడివారంగా పాటించాలని సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం చిలకంపాడులో పరిశుభ్రత, ఆరోగ్యం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం పొడి వారంగా పాటించాలని సూచించారు. ఇళ్ల సమీపంలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్లు

గణపవరం: శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్రవారం గణపవరంలోని కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ తెలగారెడ్డి బాబీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గణపవరం చినరామచంద్రపురంలోని కనకదుర్గమ్మ ఆలయం, ధనలక్ష్మి దేవి ఆలయం, పిప్పరలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొని వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. తొలుత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లికి పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

కొవ్వలిలో జ్వరాలపై క్షేత్రస్థాయి పరిశీలన

దెందులూరు: కొవ్వలి గ్రామంలో 30–50 మంది వరకు దెందులూరు వైద్యశాలలో నాలుగు రోజులుగా జ్వరాలతో చికిత్స పొందుతున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కొవ్వలి గ్రామస్తులు దెందులూరులో ఎమ్మెల్యేకు జ్వరాలపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వైద్యాధికారులను కొవ్వలి వెళ్లి వివరాలు సేకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో కొవ్వలి సచివాలయంలో వైద్య బృందం, మండలాధికారులు గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవసరమైన తాగునీటి శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం ఏలూరు ల్యాబ్‌కు పంపించాలని తహసీల్దార్ సిబ్బందికి ఆదేశించారు. వైద్య సిబ్బంది తరచూ ఇంటింటా వైద్య పరీక్షలు సమాచార సేకరణ విధిగా చేయాలన్నారు. సర్పంచ్ ఇంటేటి మధులత, కార్యదర్శి రంగనాయకమ్మ, నాయ కులు కకుసుర్తి రామకృష్ణ తదితరులు ఉన్నారు. అనంతరం ఎస్సీ ఏరియాలో తాగునీటి చెరువును అధికారులు పరిశీలించారు.


ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యసిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ శ్రీలత

కులగణనపై బాధ్యతాయుతంగా పని చేయాలి

భీమడోలు: దోష రహిత కులగణనపై ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఏలూరు ఆర్డీవో ఎస్‌ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులకు వివిధ పథకాల పురోగతిపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో కౌలు గుర్తింపు కార్డులు, ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ, సుమాటో క్యాస్ట్ పునఃపరిశీలన, ఈ క్రాప్, ఓటర్ల నమోదు, టీచర్ ఎంఎల్‌సీ ఓట్లు నమోదు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. గత ప్రభుత్వం చేపట్టిన కుల గణన కొనసాగుతుందని, భవిష్యత్తులో కుల గణన నివేదిక ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల ద్వారా నేరుగా పొందే అవకాశం ఉంటుందన్నారు. కులగణనలో తప్పులు చేస్తే బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలపై అందిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని పూళ్ల, గుండుగొలను సచివాలయాల వీఆర్వోలను ఆదేశించారు. ఏలూరు డివిజన్‌లో 75 శాతం మందికి కౌలుగుర్తింపు కార్డులను అందించామన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా సెప్టెంబర్ నుంచి 10 తేదీలోపుగానే రేషన్ కార్డుదారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాలన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీకి అర్హత కలిగిన వారు తన ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఏ.మాధవరావు, ఆర్‌ఐ కిరణ్‌కుమారి, వీఆర్వోలు వినయ్, శంకర్, వెంకటేశ్వరరావు, సింహాచలం, ఇంతియాప్, సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఏలూరు ఆర్డీవో ఎస్‌ఎస్‌కే ఖాజావలి. తహసీల్దార్ బి.రమాదేవి

నివాస ప్రాంతాల్లో సెల్ టవర్ వద్దని ఆందోళన

నిడమర్రు: నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం ఆపాలంటూ మందలపర్రు గ్రామస్తులు శుక్రవారం సెల్ టవర్ నిర్మాణం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద రుద్దర్జు నాగరాజు మాట్లాడుతూ గ్రామంలో ప్రైవేట్ నెట్ వర్క్ సెల్ టవర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని తక్షణం అనుమతిలిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ రూరల్ డవలప్‌మెంట్ ఇచ్చిన జీవో నం 334, 1994లోని నిబంధనల ప్రకారం సెల్ టవర్ నిర్మాణానికి స్థానిక పంచాయతీ అనుమతి తప్పని సరి అన్నారు. ఈ సెల్ టవర్ నిర్మాణానికి పంచాయతీ అనుమతులు లేవని ఆరోపించారు. ప్రజల నివాస ప్రాంతాల్లో 300 నుంచి 500 మీటర్ల దూరంగా నిర్మించాల్సిన 5జీ సెల్ టవర్‌ను ఇళ్లకు దగ్గర 20 మీటర్లు దూరంలో నిర్మించడం వల్ల వచ్చే రేడియేషన్‌తో పిల్లలు, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సెల్ టవర్‌ను పంట బోదెను ఆక్రమించి నిర్మిస్తున్నారని అధికారులు స్పందించి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సరిపల్లి సూరిబాబు, కృష్ణ, పొత్తూరి కృష్ణంరాజు, పొత్తూరి సూరిబాబు, పొత్తూరి శ్రీను, సునీత, ఉద్దరాజు వరలక్ష్మి తదితరులున్నారు.


మందలపర్రులో సెల్ టవర్ వద్దని ఆందోళన చేస్తున్న స్థానికులు

నేడు పెన్షన్ల పంపిణీ

దెందులూరు: మండలంలో శనివారం ఉదయం 5 గంటల నుంచి పెన్షన్ల నగదు పంపిణీ చేస్తామని దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత తెలిపారు. సచివాలయ పరిధిలో పెన్షన్‌దారులు 9,567 మందికి రూ.4,17,31,000 అందజేస్తామన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

వ్యవసాయ అధికారి బదిలీ

ఉంగుటూరు: ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన బాలిన వెంకటేష్ శుక్రవారం బదిలీ అయ్యారు. ఏలూరులోని ఏపీ సీఎస్‌ఎఫ్ జిల్లా మేనేజరుగా బాలిన వెంకటేష్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డా.ఎస్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడికి వస్తున్నారని అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

భీమడోలు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని ఏలూరు ఆర్డీవో ఎస్‌ఎస్‌కే ఖాజావలి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, భీమడోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కలెక్టర్ సెల్వి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా లక్ష మొక్కలను నాటామన్నారు. భీమడోలు మండలంలో 2,600 మొక్కలు నాటినట్టు తెలిపారు. సర్పంచ్ పాము సునీత, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఆసుపత్రి సూపరింటెంటెంట్ సునీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

గణపవరం: శుక్రవారం గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. గ్రామాల్లో రోడ్ల పక్కన ఖాళీ స్థలాలు, పంచాయతీ స్థలాలు, చెరువు గట్లు, పాఠశాల ఆవరణలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

ఉంగుటూరు: మొక్కలు నాటాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించినవారు అవుతారని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఉంగుటూరు ప్రభుత్వ కార్యాలయాలు వద్ద మొక్కలను నాటారు. ఎంపీడీవో కార్యాలయం, ఉపాధి కార్యాలయం, ఏవో కార్యాలయం, పంచాయతీ ఆఫీసు తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలను సర్పంచి సింధుతో కలిసి ఎంపీపీ నాటారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచి జగదీష్, డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు, నారాయణపురంలో సర్పంచి దిడ్ల అలకానంద , ఎ.గోవకరంలో సర్పంచి మిద్దే సత్యవతి, తల్లాపురం సర్పంచి పసుపులేటి నర్సింహరావు, సీతారాంపురంలో సర్పంచి బళ్ల రాధ, కైకరంలో సర్పంచి సలగలగోపి, తిమ్మయ్యపాలెంలో సింహాద్రి సుజాత ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు.

అందుబాటులో మొక్కలు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వివిధ రకాల మొక్కలు ఉన్నాయని కావాల్సినవారు తీసుకువెళ్లవచ్చునని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. మొక్కలు నాటుదాం–సామాజిక బాధ్యతగా చేపడదాం నినాదంతో ముందుకు వెళ్లాలని ధర్మరాజు పిలుపు నిచ్చారు.

మొక్కలను సంరక్షించాలి

దెందులూరు: మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను పెంచి ఆ మొక్కను సంరక్షించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరు సీహెచ్‌సీలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారు లు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీ డీఓ వి.శ్రీలత, వైద్యులు, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), పారిశ్రామికవేత్త కలపాల చంద్రశేఖర్ (బుజ్జి), క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి, నాయకులు మోత్కూరి నాని, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మహేష్ యాదవ్, సర్పంచ్ తోట ఏసమ్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.

భీమడోలు మండలంలో..

భీమడోలు: మండలంలోని వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లోని ప్రాంగణాల్లో వివిధ రకాల పువ్వులు, ఫలసాయం అందించే మొక్కలను నాటారు. భీమడోలు హౌసింగ్ కార్యాలయాల్లో, గుండుగొలను– 23 అంగన్‌వాడీ కేంద్రం వద్ద, పోలసానిపల్లి, భీమడోలు దేవాలయాల్లో మొక్కలు నాటారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు పాఠశాల, పోలసానిపల్లిలో రహదారి డీవైడర్‌పై మొక్కలు నాటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఉంగుటూరులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, సర్పంచి సింధు


భీమడోలు ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఏలూరు ఆర్డీవో ఎస్‌ఎస్‌కే ఖాజావలి

లైన్‌మేన్ అవినీతిపై విచారణ చేయండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పరిధిలోని గణపవరంలో లైన్‌మేన్‌గా పని చేస్తున్న వ్యక్తి లంచగొండిగా మారి విద్యుత్ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారని, అతని అవినీతిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని గణపవరానికి చెందిన చింతలపాటి మహేంద్ర అనే వినియోగదారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యుత్ సంస్థ సీఎండీ, ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, విద్యుత్ విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరంలోని జగన్నాథపురం ప్రాంతంలో ఒక వినియోగదారుని చెరువు వద్ద 1543311728000315 నంబర్ సర్వీస్‌కు సంబంధించి విద్యుత్ స్తంభాల్లో ఒకటి గత జూలైలో సంభవించిన గాలివానకు విరిగి పోగా మరికొన్ని నేలకొరిగాయి. వాటిని తొలగించి, మరొక చోటుకు ఏ విధమైన షిఫ్టింగ్ ఛార్జీలు సంస్థకు చెల్లించకుండా విరిగిపోయిన వాటి స్థానంలో మరో స్తంభం వేయడంతో పాటు మరో ఆరు స్తంభాలను గణపవరం లైన్‌మేన్‌గా పని చేస్తున్న వ్యక్తి పునరుద్ధరించారు. దీనికి సంబంధించి విద్యుత్ సంస్థకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. గాలివానకు విరిగిన స్తంభాలను అదే ప్రాంతంలో రోడ్డుపై వేయడంతో అటుగా వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. స్తంభాలు మార్చే కాంట్రాక్టును నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని తెలిపారు. ఈ ఒక్క వ్యవహారంలోనే లైన్‌మేన్ రూ.50 వేల నుంచి రూ.60 వేలు లంచం అందుకున్నట్లు తెలిసిందన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు విచారణ చేస్తే ఇతని అవినీతి వ్యవహారం మొత్తం బయటపడుతుందని కోరారు. రోడ్డుకు అడ్డంగా వేసిన విరిగిన స్తంభాలను తొలగించాలని మహేంద్ర కోరారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెదపాడు: సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి శాఖల వారీగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు మాట్లాడుతూ పెదపాడు మండలంలో సౌర విద్యుత్ ప్లాంటు నెలకొల్పుతున్నట్లు చెప్పారు. దీంతోపాటు ప్రతి ఇంటికి 3కిలో వాట్ల కెపాసిటీతో విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునని దీని కోసం వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా ఆగిన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి సాధించేలా చర్యలు చేపడతామని ఏపీఓ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీడీవో జే తేజరతన్, తహసీల్దార్ ఎన్వీడీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో ఉపాధిహామీ పథకంలో పనుల ప్రగతిని సమీక్షిస్తున్న ఎంపీపీ అధికారులు

దోమలతో వ్యాధుల వ్యాప్తి

గణపవరం: దోమల కారణంగానే అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, దోమల నిర్మూలనకు, నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డివిజనల్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కేశవరంలో దోమల కారణంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి ఇళ్ల వద్ద నిల్వ ఉన్ననీటి తొట్టెలు, పాతసామాన్లు, పూలకుండీలు, ఫ్రిజ్‌ల్లో పెరుగుతున్న దోమల లార్వాను ప్రజలకు చూపించారు. ఇళ్ల సమీపంలో పాత సామాన్ల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ, నిర్మూలన, దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పాత పాత్రలో నిల్వనీటిలో పెరుగుతున్న దోమ లార్వాను చూపుతున్న వైద్యసిబ్బంది

శిథిలావస్థలో భవనం.. బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ

- శిథిలావస్థలో భీమడోలు తహసీల్దార్ కార్యాలయం
- శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్న వైనం

భీమడోలు: ప్రభుత్వ భవనాలు శిథిలమై శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుడుండటంతో ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయ గదిలో ఎక్కువగా శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. ఇదే మండల తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఉన్నతాధికారులు వచ్చి ప్రభుత్వపరంగా అమలు చేస్తున్న పథకాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. వారు కూడా భయంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా తహసీల్దార్ శిథిలావస్థకు చేరింది. నిధుల లేమితో కనీసం మరమ్మత్తులు చేయలేదు. మండల కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా పెచ్చులూడి ఊచలు కనిపిస్తున్న భవనాన్ని చూసి బౌరా అంటున్నారు. అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజా ఫిర్యాదులు, వినతుల స్వీకరణకు హాజరయ్యే మండలస్థాయి అధికారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రెవెన్యూరికార్డులు, రిజిస్టర్లకు సరైన భద్రత కరువైంది. శుక్రవారం ఏలూరు ఆర్డీవో ఖాజావలి కూడా శిథిలావస్థకు చేరిన భవనంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, రేషన్ డీలర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో ఖాజావలి దృష్టికి తహసీల్దార్ కార్యాలయం దుస్థితిని తీసుకుని వెళ్లగా భీమడోలు సచివాలయం–2లోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చేందుకు జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. సమస్యను త్వరలో పరిష్కారిస్తామని ఆయన తెలిపారు.


శ్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప ఊచలు కనిపిస్తున్న దృశ్యం


శిథిలావస్థకు చేరిన భీమడోలు తహసీల్దార్ కార్యాలయం